# 33. రహస్యం

ఒక్కో వ్యక్తితో పరిచయం కలగటం చాలా తమాషాగా ఉంటుందనే సంగతి- సుబ్బారావు స్నేహం అయినప్పుడే అనుకున్నాను. మనం అనుకోకుండా అయ్యే పరిచయాలకు ఆశ్చర్యపడే స్థితిని దాటినవాణ్నే కాని – ఏ వ్యక్తినైతే నేను ప్రతిరోజూ అసహ్యించుకొంటూ వాణ్ని చూడాల్సి వొచ్చిన సమయాల్లో దృష్టిని మరల్చు కుంటుండేవాణ్నో అలాటి వ్యక్తితోనే పరిచయం చేసుకోవడం నిజంగా ఆశ్చర్యమే! అది పరిచయంతోనే ఆగిపోతే బాగుండేది; కాని స్నేహరూపం దాల్చింది.

సుబ్బారావు పెద్ద ఆస్తి వున్నవాడు. సామాన్యంగా ధనికవర్గం మీద నాకుండే యీర్ష్య, జుగుప్స సుబ్బారావు మీద కూడా ఉండటం చాలా సామాన్య విషయం. అతని ఆస్తి అంతా పూర్వుల నుంచే అతని చేతికి వొచ్చింది. ఆస్తిమీది ఆదాయాన్ని కులాసాగా ఖర్చుపెట్టుకోవటం ఒక్కటే సుబ్బారావు యీ లోకంలో చేయగలిగిన గొప్ప పని. సుబ్బారావు సంపాయించగల మొనగాడు కాదు, అతను దేనికీ పనికిరాడు. ఐతేనేం లోకంలో బాగా పనిచేయగలిగినవారూ, ప్రావీణ్యత ఉన్నవాళ్ళు మాత్రమే సంపాయించటంలేదు. కేవలం పెట్టుబడి పెట్టగలిగినవాళ్ళంతా సంపాయిస్తూనే వున్నారు. ఆ సంపాదన వాళ్ళ తెలివితేటల వల్ల వచ్చేది కాదు. వాళ్ళ డబ్బే మరికొంత ధనాన్ని సంపాయించ గలుగుతోంది. అందుకని 'సుబ్బారావు సమర్థుడు' అనే విషయంలో నేను అతనికి ఒక్క మార్కు కూడా వెయ్యను.

అంతతో ఆగినా బాగుండేది. ఒకడు సమర్థుడు కానంత మాత్రాన నాకు ఇంత అసహ్యం కలిగేది కాదు. ఇదే నిజమైతే నా ఎరుకలో వున్న సమర్థత కానివాళ్ళందరి

మీదా నాకు గొంతుదాకా అసహ్యత ఉండాల్సింది. నా స్నేహితుల్లోనే సమర్థత లేనివాళ్ళను నేను ఎంతో దగ్గరికి తీసుకుంటున్నాను...కాని సుబ్బారావు విషయంలో అతను చాలా అసమర్థుడు అనే నా నమ్మకం అతని మీద నాకు గొప్ప ఏహ్యభావాన్ని రేకెత్తించింది.

లోకానికి కొరగాకుండా తిరుగుతూ డబ్బును దుబారాగా ఖర్చు చేస్తున్నాడనే విషయాన్ని నేను గ్రహించకపోలేదు. గ్రహించినంత మాత్రాన, నా కేమీ సంబంధంలేని సుబ్బారావు విషయాన్ని నేను ఆలోచించటం నిజంగా హాస్యాస్పదమే! కాని లోకంలో మనకు అనవసరమయిన అనేక విషయాల్ని గూర్చి ఆలోచిస్తుంటాము. అలాగే సుబ్బారావును గూర్చి కూడా నేను ఆలోచించి అతనొక నీచుడని తేల్చుకున్నాను. ఏ క్షణానయితే ఈ నిర్ణయానికి వొచ్చానో ఆ నాటి నుంచీ అతని ప్రతి పనిలోనూ నాకు ఎంతో నీచత స్పష్టంగా కనిపించేది.

ప్రతి సాయింత్రమూ అతను క్లబ్‌కు వొచ్చేవాడు, నేనూ వెళ్లేవాణ్ని. నన్ను అతను చూస్తుండేవాడు. అతనెవరో నాకు బాగా తెలుసు. నేనెవర్నో అతనికి బాగా తెలుసుననే నమ్మకం. కాని నాలుగు సంవత్సరాలుగా మేము క్లబ్‌లో ప్రతి సాయింత్రమూ తటస్థపడుతూ ఉన్నప్పటికీ, ఒకరినొకరు మాటాడించుకొని ఎరగం. బహుశా అతనంటే నా కెంత అసహ్యత ఉండేదో నేనంటే కూడా అతనికి అంత అసహ్యతా ఉండి ఉంటుందేమో? యీ అనుమానం నాకు వొచ్చినప్పుడు - నన్ను అసహ్యంగా ఒక వ్యక్తి భావిస్తున్నాడనేది నన్ను మరింత బాధపెట్టి అతనిమీద నాకున్న అసహ్యతను రెట్టించింది. ఇది అకారణమయిన వాదనే అయినా - ఏ కారణమూ లేని కారణాలున్న అనేక న్యాయాలలో ఇది కూడా ఒకటేనని నా దృఢనమ్మకం.

ఇంకో తమాషా ఏమిటంటే - నాకూ, సుబ్బారావుకూ మిత్రులైనవాళ్ళు అనేకమంది ఉన్నారు. అతని సంగతి నా దగ్గిర మాట్లాడేప్పుడు నేను ముభావంగా ఊరుకునేవాణ్ని. వాళ్ళెవ్వరూ మా ఇద్దరికీ ఎన్నడూ పరిచయం చేసేందుకు ప్రయత్నించలేదు. మాకు పరిచయమయ్యాక ఆలోచిస్తే - వాళ్ళు మా ఇద్దరికీ పరిచయం ఉన్నదనే అనుకునేవాళ్ళట!

సుబ్బారావు న్యాయంగా నాకు చేసిన అపకారం ఏమీ లేదు. కొంత వరకూ నేనే అపకారం చేశానేమో? మునిసిపల్ ఎలెక్షనులో అతను నిలబడితే - నా ఓటును కావాలని నాకేమీ పరిచయంలేని అతని విరోధికి వేశాను. ఆ సంగతి అందరికీ తెలుసు. ఐతే ఈ సందర్భంలో సుబ్బారావు మీది కసిని నేను కొంతవరకూ తీర్చుకున్నాననీ, ఆ సంగతి సుబ్బారావుకి తెలిసిందనీ నేను తృప్తిపడకపోలేదు.

పై కారణాలన్నీ ఒక లెక్కలోవి కావేమో? కాని నేను కొన్నాళ్ళపాటు దగ్గిరికి తీసి వొదిలేసిన వరలక్ష్మి ఇప్పుడు అతని ప్రాపకంలో వుంది. ఆమె నాకు

పనికిరానిదైనమాట నిజం! కావాలనే నేను ఆమెను వొదిలించుకున్నాను. అలాటిదాన్ని సుబ్బారావు చేరదీశాడనే అతని మీద నాకు కోపం. అయితే ఆ వ్యక్తి సుబ్బారావు కాకుండా ఇంకోరెవరైనాసరే నా యీ అకారణ కోపానికేమీ తావుండేది కాదు. దీనికి ఒక్కటే కారణం – ఒక మనిషిమీద దురభిప్రాయం కలిగినప్పుడు ఆ మనిషి చేసే ప్రతి పనీ మనలో అతని మీద చెడు అభిప్రాయాన్నే కలిగిస్తుంది.

ఐతే వరలక్ష్మి విషయమే నాకో పెద్ద సమస్య అయిపోయింది. సుబ్బారావు గొడవకన్న, వరలక్ష్మి మీదనే నా ఆలోచనలు కేంద్రీకరించ బడ్డవి. వరలక్ష్మిలో ఏం చూసి సుబ్బారావు మూడు సంవత్సరాలుగా ఆమెను భరించగలిగాడు? నేను రెండు నెలలన్నా ఆమెను భరాయించలేకపోయాను. ఐతే వరలక్ష్మి నా గుణాల్ని బహుశా అసహ్యించుకొని ఉండొచ్చేమో? సుబ్బారావంటే ఎంతో ఇష్టంగా వున్నదేమో? అందరు మనుషులూ అందరిపట్లా ఒకేవిధంగా ప్రవర్తించరుగా! నా అనుమానమే నిజమైతే–సుబ్బారావును నాతో పోల్చుకొని చూస్తే – సుబ్బారావు నా కన్న గొప్ప అనే సమస్య నాకు ఎదురైంది. ఎవరి గొప్పలు వాళ్ళవే! అయినా నేను సాధించలేక అపజయాన్ని ఎదుర్కొన్న తావునే సుబ్బారావు విజయాన్ని పొందటం నా యీర్ష్యకు కారణమయింది.

ఈ కొత్త సమస్య నాకు ఎదురైనప్పటి నుంచీ సుబ్బారావుతో పరిచయం చేసుకోవాలనీ, అసలు రహస్యాన్ని తెలుసుకోవాలనీ కుతూహలం కలిగింది. అతని మీది అసహ్యాన్ని నా కుతూహలం కొంతవరకూ తొక్కివేయ గలిగిందనే చెప్పాలి.

నేను కూడా సమయం కోసం ఎదురుచూస్తున్నాను. ఏ కాస్త అవకాశం వొచ్చినా వినియోగించుకోవాలనే లెక్కలోనే వున్నా.

సుందర్రావు చుట్టపుచూపుగా నా దగ్గరకు వచ్చి క్లబ్‌లో సుబ్బారావును చూసి, తను వాణ్ని ఎరిగివుండటం వల్ల పలకరించాడు. తరువాత సుందర్రావే నాకు సుబ్బారావును పరిచయం చేశాడు.

సుబ్బారావు ఎంతో సౌమ్యంగా స్నేహపూర్వకంగా మాట్లాడాడు. అతను ఇంత మంచివాడన్న సంగతి నేను ఇంతవరకూ గ్రహించకపోయినందుకు సిగ్గుపడ్డాను. స్నేహానికి ప్రాణమిచ్చేవాడని గ్రహించేందుకు నాకు ఎక్కువ కాలం పట్టలేదు.

"ఏమండీ' దగ్గర్నించి, 'ఏరా' వరకూ వొచ్చేందుకు మా స్నేహానికి రెండు రోజులే పట్టింది. విరుద్ధ భావాలు కూడా ఒకదాన్నొకటి ఇంత త్వరలో ఆకర్షిస్తాయ్ కాబోలు!

మా ఇద్దరి మధ్యా మరి రహస్యమే లేదని నేను దృఢంగా నమ్మిన వెంటనే నేను వరలక్ష్మి సంగతి ఎత్తాను.

"నీకు తెలియందేముంది? నీ దగ్గరా ఉండెనుగా!" అన్నాడు వాడు.

"అందుకనే నేను ఆశ్చర్యంగా అడుగుతున్నాను. చీటికీ మాటికీ నాతో పోట్లాడేది. మరి నువ్వెలా మేనేజ్ చేస్తున్నావో కాని..."

సుబ్బారావు నవ్వి "నాతోనూ అంతే! దాని స్వభావమే అంత!" అన్నాడు.

"అది నాకు ఇవ్వగలిగిన సుఖంకన్న దుఃఖమే ఎక్కువ-"

"నా విషయంలోనూ అంతే. దాని దగ్గరకు వెళ్ళటం అంటే ఆకలితో ఉన్న పులి బోనులోకి నిరాయుధంగా పోవటంలాగే ఉంటుంది నాకు!"

"మరి మూడేళ్ళుగా భరిస్తున్నావ్. ఆమెను వెంటే సర్దుకొని సినిమాలకూ, తీర్థయాత్రలకూ వెళ్తావ్. యీ న్యూసెన్సును ఎలా భరిస్తున్నావంట?"

"వరలక్ష్మి ఎంతో అందమైనది. ఎంతో నాజూకైనది. దానికి తగినట్టు గయ్యాళిగంప!"

"ఆ గంపనే ఎలా మోస్తున్నావని అడుగుతున్నాను."

"అది గయ్యాళిగంపనే సంగతి నీకు తెలుసు, నీకు అనుభవం వుంది కనుక. మిగతా ఎవరికీ తెలియదు కదా!"

"అందువల్ల నీకు కలిగే లాభమేమిటి?" అన్నాను.

"అంత అందమైనదాన్ని నాజూకైనదాన్ని నేను ఉంచానని ఎంతో మంది నన్ను చూసి యీర్ష్యపడుతుంటారు. ఆమె పక్కన కూర్చున్న నన్ను చూసి నేనొక్కణ్ణే స్వర్గంలో ఉన్నట్టు, తామంతా భూమిమీద వున్నట్టు భావించి ఎంతోమంది ఖిన్నులవటం నేను ఎరుగుదును."

"ఇతరులకు బాధకలగటంలో అబద్ధమేమీ వుండదు కాని, నిజానికి నీకు మాత్రం ఆమె వల్ల కలిగే సుఖమేమిటి?"

"నాకు ఆమెవల్ల సౌఖ్యంలేదు. అయితేనేం ఇతరులు నన్ను అభినందిస్తుంటారు. మేమిద్దరమూ రైలు ఎక్కితే చోటు లేకున్నా నా మొహం చూసి కాకపోయినా ఆమె మొహం చూసన్నా చోటిస్తారు. నా ఈ అదృష్టాన్ని తలుచుకొని లొట్టలు వేస్తారు. వీళ్లంతా ఏడవడం చూసిన నాకు ఆనందం కలుగుతుంది.!"

"ఇతరుల ఏడుపు-?" అన్నాను అర్థంగాక.

"విను. నీ దగ్గర ఎంతో డబ్బు వుందనుకో, నిజానికి అది నీకు ఏ విధమైన ఆనందాన్ని ఇస్తుంది? దాన్ని ఖర్చు పెట్టే మార్గాలు ఎన్నో ఉన్నాయ్. కాని ఖర్చుపెట్టకుండా వుంచుకున్నందువల్ల కూడా ఆనందం లేకపోలేదు. అంత ధనం ఇతరుల వద్ద లేదనే ఊహ, ఇతరులంతా నువ్వంటే యీర్ష్యతో క్షోభిస్తున్నారనే తలపు

నీకు ఆనందాన్ని ఇస్తుంది. ఆ ధనం వల్ల ఇతరులకన్నా నువ్వేమీ ఎక్కువ ఆనందాన్ని అనుభవించవు - నువ్వు ఖర్చుపెడితేగా! అదే విధంగా–"

నాకు కోపం నసాళం అంటింది. సుబ్బారావు ఎంత తెలివిగా ఆలోచించి ఆనందాన్ని అడ్డదారిలో పొందగలిగాడో బాగా అర్థమైంది. సుబ్బారావు వొఠ్ఠి తెలివితక్కువ వాడనే నా దురభిప్రాయం, కూకటివేళ్ళతో సహా కదిలిపోయింది. సుబ్బారావులాటి మిత్రుల వల్ల ఉత్తరోత్రా నేను ఇంకా తెలుసుకోవాల్సిన కీలకాలున్నయ్యని ఇట్టే గ్రహించాను. వెంటనే అతని శుశ్రూషకు సిద్ధపడటంలో తప్పులేదు.

– *ఆగష్టు, 1948*